క్లుప్తంగా

'తొలిమెట్టు'పై అవగాహన



కృష్ణా: మండలంలోని కున్సి, హిందుపూర్ పాఠశాలలను సోమవారం డీఆర్‌పీలు నరేందర్, శ్రీకాంత్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో వివరాలు ఏ విధంగా నమోదు చేయాలి, తొలిమెట్టు పాఠ్యాంశాల బోధన తీరుపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

ఊట్కూరు: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పదో తరగతి 1996–97 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 100 ప్లేట్లు, గ్లాసులను దేవాలయ కమిటీ వారికి అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

అమావాస్య పూజలు

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలలో సోమవారం అమావాస్య పూజలు నిర్వహించారు. రాష్ట్రాల సరిహద్దులోని కాలబెలగుంది క్షేత్రంలో స్వామివారికి సుప్రభాతం, రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తరనామావళి, అభిషేకం, అలంకరణ, హారతి తదితర పూజలు చేశారు. భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదానం చేపట్టారు. మండలంలోని ఎక్లాస్‌పూర్ తిమ్మప్పస్వామి మందిరం, జిలాల్‌పూర్ కర్రెప్పస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు.

దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి

మరికల్: ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్‌పై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు రామస్వామి, తిరుపతయ్య, గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ శాంతియుతంగా ప్రచారం ముగించుకొని ఇంటికి వెళ్తున్న ఎమ్మెల్యేపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పరిశుభ్రం



మాగనూర్: నేరడగం– మక్తల్ ప్రధాన రహదారి పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని శుక్రవారం సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న ముళ్లపొదలను, చెత్త కుప్పలను తొలగించారు. దీంతో పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలోను ఇలా ఉండటం వల్ల అనేక ప్రమాదాలు సంభవించాయని, ప్రస్తుతం సమస్య తొలగిందని తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం



కోయిల్‌కొండ: బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఈ సారి అవకాశం ఇవ్వాలని నారాయణపేట కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి కోరారు. సోమవారం మండలంలోని మనికొండ, పేర్కివీడు, రాజునాయక్‌తండా, కేశ్వాపూర్, వీరంపల్లి, ఆచార్యపూర్ గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా..

నారాయణపేట: చిట్టెం కుటుంబంతో ఉన్న సన్నిహితులను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి ఆదివారం పట్టణంలో కలిశారు. ఈ సందర్భంగా 2005లో మావోయిస్టుల కాల్పుల్లో మరణించిన దూలం విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులను కలిశారు. అధైర్యపడొద్దని మీ అందరికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

ఎస్సీ వర్గీకరణ కమిటీపై హర్షం

నారాయణపేట రూరల్: ఎస్సీ వర్గీకరణ కోసం కమిటీ వేస్తామని ప్రధాని మోదీ ప్రకటించడంపై జిల్లా కేంద్రంలోని వీరసవార్కార్ చౌరస్తాలో బీజేపీ నాయకులు, ఎస్సీ కుల పెద్దలు ప్రధాని మోదీ, మందకృష్ణమాదిగ చిత్రపటాలకు సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీల దశాబ్దాల కలను మోదీ సాకారం చేస్తున్నారని, ప్రధాని ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదం పొందుతుందని ఆశాబావం వ్యక్తం చేశారు. రఘువీర్, విజయ్, రాము పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపావళి వేడుకలు



దీపావళి వేడుకల్లో ఎస్పీ దంపతులు



కోస్గిలో ఓ ఇంటి ఎదుట టపాసులు కాలుస్తున్న చిన్నారులు, పెద్దలు

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు వెలుగులు చిమ్ముడు దీపావళి వేడుకలు అంబరాన్ని తాకాయి. వలస జీవులు సొంత ప్రాంతానికి రావడంతో పల్లెలు సరికొత్త శోభను సంతరించుకుంది.

దీపావళి వేడుకల్లో ఎస్పీ దంపతులు..

పట్టణంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో తోటి పోలీసు సిబ్బందితో కలిసి ఎస్పీ దీపావళి వేడుకలను నిర్వహించారు. బీహార్‌కు చెందిన ఎస్పీ యోగేష్‌గౌతమ్ ఎన్నికల విధుల దృష్ట్యా సొంత ఊరికి వెళ్లకుండా కుటుంబ సభ్యులతో కలిసి స్థానికంగా పండుగలో పాల్గొన్నారు.

కోస్గి: మండలంలోని గ్రామగ్రామాన ఆదివారం దీపావళి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. వ్యాపారులు తమ వ్యాపార దుకాణాల్లో లక్ష్మీ పూజలు చేసి టపాసులు కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు. వాహన యజమానులు పూల దండలు వేసిపూజలు చేశారు. కొందరు నోముల పేరుతోఅమ్మవారిని పూజించారు. ఇళ్ల ఎదుట చిన్నారులు టపాసులు కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు.

మద్దూరు: మండలంలో దీపావళి పండుగను ఆదివారం, సోమవారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీపూజల నిర్వహించారు. కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా పలు గ్రామాల్లో సత్యనారాయణస్వామి వ్రతాలు, గౌరమ్మ నోములు నోచారు. మండలంలోని పల్లెర్ల, నందిపాడ్, నిడ్జింత, దోరేపల్లి, భూనీడ్, నందిపాడ్ తదితర గ్రామల్లో వేడుకలను ఘనంగా చేశారు.

దామరగిద్ద: మండలంలోని అన్ని గ్రామాల్లో దీపావళి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.



సరాఫ్‌బజార్‌లో టపాసులు కాలుస్తున్న కుటుంబ సభ్యులు



మద్దూరులో టపాసులు కాలుస్తున్న చిన్నారులు

దక్షిణాదిలో తొలి హ్యాట్రిక్ బీఆర్‌ఎస్‌దే



జాజాపూర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



మరికల్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలంతా గులాబీ పార్టీవైపే ఉన్నారని, ఈ సారి ఎన్నికల్లో వంద సీట్లు సాధించి తెలంగాణలో బీఆర్ఎస్ మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి దక్షిణాదిలో హ్యాట్రిక్ సాధించిన తొలిపార్టీగా ఆవిర్భవిస్తుందని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జాజాపూర్, తిర్మలాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామ వీధుల గుండా పర్యటిస్తూ ఓటర్లను కలుసుకుని ప్రభుత్వ పథకాల కరపత్రాలు అందించి మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన సాధ్యం కాని ఆరు హామీలను నమ్మి మోసపోవద్దని తెలిపారు. 24గంటల కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్‌ను కాదని మూడు గంటల విద్యుత్ ఇస్తామన్న కాంగ్రెస్‌కు ఓట్లు ఎలా వేస్తామని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ వస్తే జనరేటర్లు, ఇన్వెటర్లు తప్పవని తెలిపారు. ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్లు కేసీఆర్ రెట్టింపు చేస్తారని మద్దతు ఇవ్వాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ అంజలి, రాములు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి..

కోయిల్‌కొండ: నియోజకవర్గంలో గ్రామగ్రామాన చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు మరోసారి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని రాంపూర్, మల్కాపూర్, రాజునాయక్‌తండా, తిర్మలంపల్లి, లింగుపల్లి, చంద్రాస్‌పల్లిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. మిషన్‌భగీరథతో ప్రతి ఇంటికి తాగునీరు, రైతులకు పెట్టుబడి కింద రైతుబంధు వంటి అనేక పథకాలతో నిరుపేదలు లబ్ధిపొందారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ రవికిరణ్, రవి, భీంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థుడైన నాయకుడిని గెలిపించుకుందాం..

దామరగిద్ద: బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ నేతృత్వంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన సమర్థుడైన నాయకుడిని మరోసారి గెలిపించుకుందామని ఎంపీపీ నర్సప్ప, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దామరగిద్ద, గడిమున్కన్‌పల్లి, క్యాతన్‌పల్లి, చాకలోన్‌పల్లి, లోకుర్తి, మద్దెల్‌బీడ్ కంసాన్‌పల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నియోజకవర్గంతో పాటు దామరగిద్ద మండలం ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం..

మరికల్: మండలంలో ఆయా గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలు మోసపోయి కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మరో వందేళ్లు రాష్ట్రం వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో రామస్వామి, తిరుపతయ్య, రాములు, బసంత్, కృష్ణారెడ్డి, ప్రకాష్‌శెట్టి, బాలస్వామి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న అబ్దుల్ అజీద్

ఊట్కూరు: ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మూమెంట్ ఫర్ పీస్ జస్టిస్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీద్ కోరారు. మండల కేంద్రంలోని ఆదివారం ఎంపీజే ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి ఒక్కరికి వజ్రాయుధం లాంటిదని అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. కులమతాలకు అతీతంగా డబ్బుకు, మద్యానికి లొంగకూడదన్నారు. సుమారు నూటికి 25 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకోవడం లేదని తెలిపారు. గ్రామంలోని యువకులు, స్వచ్ఛంద సంస్థసభ్యులు ప్రజలకు అవగాహన కలిపించి వందశాతం పోలింగ్ అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి సలీం, హమీదుద్దీన్, షకిల్, కాశీంహుస్సేన్, అల్తాఫ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో ఎన్నికలు



కల్వాల్‌లో పోలీస్‌ల ఫ్లాగ్‌మార్చ్

నర్వ: మండలంలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ కురుమయ్య అన్నారు. సోమవారం కల్వాల్‌లో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొదించి శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ప్రజలందరికీ పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో 50 మంది కేంద్రబలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మోసపూరిత మాటలను నమ్మొద్దు



నేరడగంలో పథకాల గురించి వివరిస్తున్న చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాగనూర్: కాంగ్రెస్, బీజేపీ నాయకుల మోసపూరిత మాటలను నమ్మితే మోసపోయి, గోసపడక తప్పదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం నేరడగం, ఉజ్జెల్లి, బైరంపల్లి, నేరడగందొడ్డిలో ప్రచారం నిర్వహించి గ్రామాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపనులు, ఎన్నికల హామీలను వివరించారు. పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోస తీవ్రంగా శ్రమించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని అన్నారు.

మరింత అభివృద్ధికి ప్రోత్సహించండి



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కోస్గి: ఐదేళ్లలో నియోజకవర్గంలో రూ.కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశామని, రెండోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చూడాలని తెలిపారు. కార్యక్రమంలో మ్యాకల రాజేష్, భీంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మాస్టర్ శ్రీనివాస్, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చూపిస్తా



అమరచింత: మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జలేంధర్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని తూక్యానాయక్‌తండాతో పాటు పట్టణ పురవీధుల గుండా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తూక్యానాయక్‌తండాలో పలువురు గిరిజన యువకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో క్యామ భాస్కర్, శ్రీనివాసులు, మేర్వరాజు, వెంకటేశ్వర్లు, అశోక్, నరాల నారాయణ, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: నియోజకవర్గ కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సభకు హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలో అందరూ తరలివచ్చి విజయమవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొండయ్య, కనకరాజు, కర్నిస్వామి, శ్రీనివాస్, అఖిలరెడ్డి, ప్రసన్నరెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌లో సోమవారం బీజేపీ అభ్యర్థి జలేంధర్‌రెడ్డి సతీమణి పద్మజారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శ్రీనివాసులు, మజ్జిగ సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ప్రచారం

- మాగనూర్ మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ వాకిటి పూలవతి, వాకిటి శ్రీనివాసులు ఆదివారం మక్తల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.
- బీజేపీ పేట అభ్యర్థి రతంగపాండురెడ్డి సోమవారం మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

నేడు కళాఉత్సవ్ పోటీలు

నారాయణపేట రూరల్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎండీ అబ్దుల్ ఘని ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాల, కళాశాలలకు సంబంధించి 9 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉదయం 9:30 గంటలకు మినీ స్టేడియంలోని బాలకేంద్రానికి హాజరుకావాలని తెలిపారు. జానపద, శాస్త్రీయ నృత్యం, గానం, సంగీత వాయిద్యాలు వాయించడం, చిత్రలేఖనం, బొమ్మల తయారీ, సోలో డ్రామా ఉంటుందని, విజేతలకు సాయంత్రం బహుమతులు అందించి ఈ నెల 15, 16న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు.

కోడిపందెం స్థావరాలపై దాడి

మరికల్: మండలంలోని పూసల్‌పహాడ్ శివారులో కోడి పందెం ఆడుతున్న శిబిరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. తీలేర్ పంపుహౌస్ నుంచి కోయిల్‌సాగర్ వెళ్తున్న ప్రధాన కాల్వ వద్ద వివిధ గ్రామాలకు చెందిన వారు కోళ్ల పందెం ఆడుతుండగా దాడులు నిర్వహించగా కొందరు పారిపోగా, ఏడుగురిని పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన వారికి సంబంధించి 15 బైక్‌లు, కోళ్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.1,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా: తప్పిన ప్రమాదం



మాగనూర్: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో గల సంగంబండ నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుడి లోలెవల్ కాల్వలో ట్రాక్టర్ బోల్తాపడిన ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన నాగరాజు పొలం వద్ద వడ్లను తీసుకురావడానికి ట్రాక్టర్ తీసుకెళ్తుండగా ప్రమాదవశత్తు అదుపుతప్పి కాల్వలోకి ఇంజన్‌భాగం పూర్తిగా పడిపోయింది. ప్రమాద సమయంలో డ్రైవర్ మాత్రమే ఉన్నాడు. ముందస్తు అప్రమత్తతతో ప్రాణపాయం తప్పిందని తెలిపారు.

వ్యక్తికి గాయాలు

ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లికి చెందిన ఎర్రప్ప సోమవారం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు అయ్యాయి. ఎర్రప్ప ద్విచక్ర వాహనంపై మక్తల్ నుంచి గ్రామానికి తిరిగి వస్తుండగా లింగంపల్లి స్టేజి సమీపంలో అదుపు తప్పి ఆర్టీసీ బస్సుకు ఢీకొట్టాడు. దీంతో కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటీని నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చంద్రమోహన్ మృతికి సంతాపం

నారాయణపేట రూరల్: తెలుగు చలనచిత్ర నటుడు చంద్రమోహన్ మృతికి ఎస్పీ బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, టీవీ రేడియో గాయకుడు సంగ నర్సింహులు, బాలకేంద్రం సభ్యులు ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఎన్నో సందేశాత్మక చిత్రాలను తీసిన చంద్రమోహన్ తెలుగు చిత్ర పరిశ్రమలో మహోన్నత స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. కళాకారులు, ప్రేక్షకులు, అభిమానులకు ఆయన లేని లోటు తీర్చలేనిదని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చరిత్ర తెలుసుకుని ఓటెయ్యండి

మరికల్: రాజకీయ పార్టీల చరిత్ర చూసి ప్రజలు ఓటు వేయాలని బీజేపీ నాయకుడు నాగురావు నామాజీ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజల హామీలను నెరవేర్చని ప్రభుత్వం పునాదులు కదిలించాలన్నారు. పార్టీలు మారుతున్న శివకుమార్‌రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. నర్సన్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రామస్వామి

మరికల్: మాదిగలపై ప్రధాని మోదీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే వచ్చే పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి, జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నికల వ్యూహంలో భాగంగానే హైదరాబాద్‌లో నిర్వహించిన విశ్వరూప మహాసభకు ప్రధాని హాజరయ్యారన్నారు. 40 ఏళ్ల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు ఎన్నో ఉద్యమాలు చేసిన పట్టించుకోని కేంద్రం ఇప్పుడు ఓట్ల కోసం తమపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని మండిపడ్డారు. మరోసారి తమను మోసం చేయడం కోసమే ప్రధాని మోసానికి తెర లేపారని ఆరోపించారు. వర్గీకరణ కోసం ప్రత్యేక కమిటీ వేస్తామని మోదీ చెప్పగానే మాదిగాలు ఎవరూ బీజేపీకి ఓట్లు వేయరన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశంలో బిల్లు ప్రవేశ పెడితే మీ వెంట ఉంటామన్నారు. లేకుంటే వర్గీకరణ బిల్లు కోసం ఉద్యమాలు చేస్తూ న్నే ఉంటామని తెలిపారు. సమావేశంలో గోపాల్, శివ, బాలకృష్ణ, కమల్, మాసన్న, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన మినీట్యాంక్ బండ్ పనులు

మరికల్: ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి 9 ఏళ్ల పాలనలో అభివృద్ధి ఎక్కడ చేశారో చూపించాలని కాంగ్రెస్ నాయకులు సూర్యప్రకాష్, హరీష్ డిమాండ్ చేశారు. 8 ఏళ్ల నుంచి నత్తనడకన సాగుతున్న మరికల్ మినీట్యాంక్‌బండ్ పనులను సోమవారం వారు పరిశీలించారు. మండలంలో బీఆర్ఎస్ నాయకులు చెప్పినట్లు ప్రజలను నడుచుకోవాలని హుకుం జారీ చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు చెరువులను ఆక్రమించుకోవడమే కాకుండా ప్రజల ఆస్తులను కూడా దోచ్చుకుంటున్నారని ఆరోపించారు. కృష్ణయ్య, రామకృష్ణ, మొగులప్ప, సత్యన్న, రాజు పాల్గొన్నారు.

మక్తల్‌లో బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదు



మాట్లాడుతున్న బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి

మక్తల్: నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఓడిపోవడం ఖాయమని నర్వ పీఏసీఎస్ మాజీ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం ఏమాత్రం అభివృద్ధి కాలేదని, ప్రభుత్వం నుంచి తీసుకొచ్చిన నిధులు ఏమీ లేవన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను కనుమరుగు చేయాలన్నారు. అందరూ కలిసి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గం ఇకనుంచి అరాచకాలు ఇక సాగవని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని కాంగ్రెస్ అభ్యర్థికి ఎంపిక చేసిందని, అందరం అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వాకిటి శ్రీహరి, బాలకృష్ణారెడ్డి, నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్, గోపాల్‌రెడ్డి, నీలప్ప తదితరులు పాల్గొన్నారు.

నర్వ: మండల పీఏసీఎస్ మాజీ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి సోమవారం కోస్గి పర్యటనలో ఉన్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరారు.

కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు



కాంగ్రెస్‌లో చేరిన కోస్గి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దంపతులు

నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ కోట్ల జగన్మోహన్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. శనివారం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సమక్షంలో పార్టీ మారడంలేదని పత్రిక ప్రకటన ఇచ్చిన ఆయన రాత్రికి రాత్రే మనసు మార్చుకున్నారు. తాను కాంగ్రెస్‌లో చేరుతున్నానని వచ్చిన డీసీసీ నోట్‌పై తీవ్ర స్థాయిలో వ్యతిరేకించారు. రాత్రికిరాత్రి మనుసు మార్చుకుని ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి చేత కండువా కప్పించుకుని పార్టీలో చేరారు.

- పీవైఎల్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కాశీనాథ్ సైతం కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ పార్టీ ఎన్నికల బరిలో ఉండదని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పర్ణికారెడ్డి తరపున ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయిస్తామని తెలిపారు.
- **కోస్గి:** మున్సిపల్ వైస్ చైర్మన్ అన్నపూర్ణ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. సోమవారం కోస్గిలో రేవంత్‌రెడ్డి సమావేశంలో భర్త హరికుమార్‌తోపాటు పలువురు నాయకులతో కలిసి చేరగా రేవంత్‌రెడ్డి వారికి కండువాలు వేసి చేర్చుకున్నారు. అదేవిధంగా మ్యాకల రవి, అన్నపూర్ణ, బిజ్జారం చెందిన బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతి పలువురు కాంగ్రెస్‌లో చేరారు.
- **అలంపూర్ నుంచి..**

జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పలువురు ప్రజాప్రతినిధులు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. పట్టణంలో నిర్వహించిన సభలో వారికి కండువా కప్పారు. అలంపూర్ జెడ్పీటీసీ శంషాద్ ఇస్మాయిల్, వడ్డేపల్లి జెడ్పీటీసీ కాశపోగు రాజు, ఉండవెల్లి జెడ్పీటీసీ రాములమ్మ, రాజోళి జెడ్పీటీసీ సుగుణమ్మతోపాటు ముగ్గురు ఎంపీపీలు, 34 మంది ఎంపీటీసీలు, 15 మంది సర్పంచ్‌లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసినట్లు తెలిపారు. వీరితోపాటు ఆర్డీఎస్ మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి, మద్దిలేటి రామ నాయుడు, జగన్మోహన్ నాయుడు, అయిజ మండల నాయకులు మేడికొండ లక్ష్మీకాంతరావుతోపాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు.